క్లుప్తంగా

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

చింతకొమ్మదిన్నె : మండలంలోని మూలవంక గ్రామంలో వెలసిన వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ ఉంటుందన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం, రాత్రికి స్వామి వారి ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని జయప్రదం చేయాలన్నారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్షలు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వెంకటప్ప ఇంగ్లీషు మీడియం పాఠశాల, రమణప్పసత్రంబడి ఉన్నత పాఠశాలల్లో శనివారం కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతి ప్రవేశం కొరకు నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షలకు పులివెందుల ప్రాంతం నుంచి 481 మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకోగా.. 439 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో పరీక్షా కేంద్రాల పరిశీలకులు ప్రసాద్, రవీంద్ర, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

రేపు గడప గడపకు మన ప్రభుత్వం

వీరపునాయునిపల్లె : మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, నరేన్ రామాంజుల్‌రెడ్డిలు పాల్గొంటారని మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

చలివేంద్రాల ఏర్పాటు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీవెంకటేశ్వరస్వామి గుడి సమీపంలో శనివారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ చలివేంద్రం, అలాగే బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదురుగా మున్సిపల్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తో కలిసి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యార్థులకు యోగ సాధన

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీసరస్వతి విద్యామందిరం పాఠశాలలో మే 1వ తేదీనుంచి 6వ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు యోగ సాధన శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పతంజలి సంపూర్ణ యోగ ప్రచార సమితి అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు పేర్ల నమోదుకు 9441011085, 9398537057, 8074745479 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మన్‌కీ బాత్ విజయవంతం చేయండి

వేంపల్లె : ప్రధానమంత్రి నరేంద్రమోడి దేశ అభ్యున్నతి కోసం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ నాయకులు తెలిపారు. శనివారం వారు వేంపల్లెలో విలేకరులతో మాట్లాడారు. రేడియో ద్వారా మారు మూల ప్రాంతాల్లో జరుగుతున్న అనేక మంచి విషయాలను స్పృశిస్తూ, అనేక మంది విజయాలను దేశ ప్రజలకు పరిచయం చేస్తూ గత 100 నెలలుగా జన హృదయాలను స్పర్శించి ఏప్రిల్ 30న 100వ ఎపిసోడ్ ప్రసారమవుతుందన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

వీరపునాయునిపల్లె : ప్రజా వ్యతిరేఖ కార్యక్రమాలను చేపడుతున్న కేంద్ర ప్రభుత్వం అరెస్టులతో ఉద్యమాలను ఆపలేదని సీపీఐ కమలాపురం నియోజకవర్గ సహాయ కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య అన్నారు. శనివారం సాయంత్రం కడపలో నిర్వహిస్తున్న భహిరంగ సభకు ఎలాంటి అనుమతి లేదని వెళ్లకూడదని ఆయనకు పోలీసులు నోటీసులివ్వడంతో పాటు ఇంటిలోనే నిర్బంధించారు. ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పోలీసుల ద్వారా నోటీసులిచ్చి అరెస్టులు చేయిస్తోందన్నారు.

పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలి

చెన్నూరు : పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించడంతో తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలని శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆయన శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్లో విలేకరులతో మాట్లాడుతూ మే మాసంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో తల్లిదండ్రులు పిల్లల్ని బయటకు పంపవద్దన్నారు. మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇస్తే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సెలవు రోజూ పన్నులు చెల్లించవచ్చు

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలోని ఆస్తి పన్నును సెలవు రోజైన ఆదివారం కూడా ఐదు శాతం రాయితీతో చెల్లించవచ్చునని మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

గడప గడపలో అపూర్వ ఆదరణ

–ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : మండలంలోని దిగువపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని డీ కొత్తపల్లెలో శనివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభించిందని ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఆయన ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలను గురించి వివరించారు. గ్రామంలోకి రావడానికి వంకపై కల్వర్టును, అలాగే శ్మశానానికి వెళ్లే దారిలో వంకపై కల్వర్టును నిర్మించాలని, గ్రామం నుంచి వల్లూరుకు వెళ్లే దారిని తారు రోడ్డుగా మార్చాలని ప్రజలు కోరారు. ఈ మేరకు వాటిని మంజూరు చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, మాజీ సర్పంచ్ హరి కేశవరెడ్డి, సర్పంచ్ కుళాయప్ప, జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, మాజీ



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి

సర్పంచ్ సుబ్బారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, భీమారెడ్డి శివారెడ్డి, ఓబుల్‌రెడ్డి, వెంకటశివారెడ్డి, శివశంకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ప్రభువీటి రమణ, బొందుగాల్ల దస్తగిరి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్తు... గ్రాండ్ సక్సెస్

కమలాపురం : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు.. కార్యక్రమం గ్రాండ్ సక్సెస్ అయిందని, రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ సైనికులు 1.45 కోట్ల గృహాలు సందర్శిస్తే 1.10 కోట్ల మిస్డ్ కాల్స్‌తో ప్రజలు జగనన్నకు మద్దతు తెలిపారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్నే మా భవిష్యత్తు.. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. ఈనెల 7వ తేదీ నుంచి 29వ తేదీ వరకు 15వేల సచివాలయాల పరిధిలో చేపట్టిన మెగా పీపుల్స్ సర్వే ఒక చారిత్రాత్మకం అన్నారు. 7 లక్షల మంది పార్టీ సైనికులు 1.45 కోట్ల గృహాలు సందర్శించారన్నారు. అందులో 1.10 కోట్ల కుటుంబాలు మిస్డ్‌కాల్స్ ఇచ్చి తమ మద్దతును జనగన్నకు తెలిపారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, గృహసారధులకు ఆయన కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు. అలాగే కమలాపురం నియోజకర్గంలో కూడా 89శాతం ప్రజలు తమ మద్దతును తెలియజేశా రన్నారు. సర్వే పూర్తి అయిన తర్వాత గ్రామాల వారీగా వివరాలు వెల్లడిస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, చెన్నకేశవరెడ్డి, కొండారెడ్డి, నిఖిల్‌రెడ్డి, గఫార్, ఖాజాహుసేన్, శరత్‌బాబు, షావలి, దేవదానం, జెట్టి నగేష్, ఇర్ఫాన్, రెడ్డి కరీం తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమ ఫలాలు



పులివెందులలో స్టిక్కర్లను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వేములలో లబ్ధిదారునికి బ్రోచర్‌ను అందిస్తున్న మండల ఇన్‌చార్జి, తదితరులు

పులివెందుల టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని బలిజ సంఘం వీధి, జెండా మానువీధి, గుంత బజార్ ప్రాంతాలలో శనివారం జేసీఎస్ ఇన్‌చార్జి హఫీజుల్లా ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్-జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లు ప్రారంభించారు. కౌన్సిలర్ శైలజ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్, ఖాదర్ బాషా, కో ఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్, సంఘ నాయకులు, ఆలయాల చైర్మన్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : మండలంలోని ఎర్రబల్లె -2 పరిధిలోని సుగాలి తాండాలో శనివారం సాయంత్రం జగనన్నే మా భవిష్యత్ - మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, పంపీపీ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యం

వేముల : ఆర్థికాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని గొల్లలగూడూరు గ్రామంలో జగనన్నే మా భవిష్యత్-మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖరరెడ్డి, మాజీ సర్పంచ్‌లు రమణారెడ్డి, గంగాధరరెడ్డి, ఇసీ మహేశ్వరరెడ్డి, సచివాలయ కన్వీనర్ రవీంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడప గడపకు సంక్షేమ పథకాలు

–ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి

పెద్దముడియం : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలు గడప గడపకు చేరుతున్నాయని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సుద్దపల్లె గ్రామంలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు సమస్యలపై ఆరా తీశారు. అర్హత ఉండి పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మఒడి, వైఎస్ఆర్ ఆసరా, వైఎస్సార్ చేయూత, రైతు భరోసా, జగనన్న విద్యా దీవెన, సున్నావడ్డీ, వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద పరిహారం వంటి పథకాల ద్వారా ఒక్కో



వృద్ధురాలి సమస్యను వింటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

కుటుంబానికి ఈ నాలుగేళ్లలో రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు లబ్ధిచేకూరిందన్నారు. మరోమారు వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మనోహర్ రెడ్డి, శివలక్ష్మిరెడ్డి, బాషా, బాలసుబ్బారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, కోటిరెడ్డి, ఉపేంద్రారెడ్డి, చవ్వా క్రిష్ణారెడ్డి, గ్యాస్ శివారెడ్డి, ఈశ్వరరెడ్డి, ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రేపు పూర్తైన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

వేముల : మండల పరిధిలోని భూమయ్యగారిపల్లె గ్రామంలో పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. గ్రామంలో రూ.3.30 కోట్లతో అభివృద్ధి పనులను పూర్తి చేశారు. ఈ పనులను సోమవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేతులమీదుగా ప్రారంభిస్తున్నట్లు జడ్పీటీసీ బైపురెడ్డి తెలిపారు. గ్రామంలో రూ.2.26 కోట్లతో నూతనంగా కల్యాణ మండపం, భోజనశాలతోపాటు చుట్టూ ప్రహరీ గోడను, నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించనున్నారు. అలాగే రూ.1.04కోట్ల వ్యయంతో నూతన సచివాలయ భవనంతోపాటు చుట్టూ ప్రహరీ గోడ, సీసీ రోడ్డును ఆయన ప్రారంభిస్తారు.

వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి

వేంపల్లె : వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డిపై టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు ధ్వజమెత్తారు. శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు విలేకరులతో మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా వేంపల్లె మండలాన్ని ఎంతో అభివృద్ధి చేసిన ఘనత జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రజలకు చేస్తున్న సేవలను చూసి ఓర్వలేక ఇలాంటి తప్పుడు ఆరోపణలు, విమర్శలు చేస్తున్నారన్నారు. రామమునిరెడ్డికి రాజకీయ భవిష్యత్ ఇచ్చిందో ఎవరో గుర్తు చేసుకోవాలన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోండి

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీలో ఎక్కడే కానీ నీటి సమస్య తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్‌లు తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అధ్యక్షతన కౌన్సిలింగ్ సమావేశాన్ని ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. వేసవి దృష్టిలో ఉంచుకుని ప్రతి వార్డులో కౌన్సిలర్లు పర్యటించాలని, అలాగే ఆ వార్డులలో నెలకొన్న సమస్యలను తెలుసుకుని మా దృష్టికి తీసుకొస్తే వాటిని వెంటనే పరిష్కరిస్తామన్నారు. అలాగే మీ వార్డుల్లో ఏవైనా నీటి సమస్యలు ఉంటే తక్షణమే తెలియజేయాలని.. ట్యాంకర్ల ద్వారా అయినా సరే నీటిని ప్రజలకు అందిస్తామన్నారు. ప్రజలు కూడా మీ ప్రాంతాలలో నీటి సమస్య ఉంటే వెంటనే తెలపాలన్నారు. అంతేకాక చెత్తను ప్రతి ఒక్కరు పురపాలక చెత్త వాహనంలో వేయాలని.. రోడ్డుపై వేయకూడదన్నారు. ప్రతి ఒక్కరు మీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని.. మున్సిపల్ పారిశుధ్య సి బ్బంది ప్రతి రోజు వార్డులో క్లీనింగ్ చేస్తుంటారని



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

తెలిపారు. అలాగే కౌన్సిలర్లు కూడా పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే శానిటరీ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి ప్రతినిత్యం పర్యవేక్షిస్తుంటారన్నారు. అనంతరం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో 20 అంశాలకు సంబంధించి అభివృద్ధి పనులకు కౌన్సిల్ అమోదం తెలిపింది. అభివృద్ధికి సంబంధించి రూ.50.64 కోట్ల పనులు జరిగాయని.. అలాగే రోటరీపురం, ఉలిమెల్ల సీసీ రోడ్డు పనులకు సంబంధించి నివేదికలను అధికారులకు పంపించడం జరిగిందని.. అలాగే నాడు-నేడు ఫేజ్-2 సంబంధించి 20 స్కూళ్లకు జరుగుతున్న పనులు జూన్ నెలాఖరుకల్లా పూర్తిచేయాలన్నారు.

రేపటి నుంచి ప్రత్యేక తరగతులు

లింగాల : లింగాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరం ఫెయిల్ అయిన విద్యార్థులకు సోమవారం నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ రాజశేఖరరెడ్డి తెలిపారు.

అక్రమ లే అవుట్లపై చర్యలు తీసుకోవాలి

వేంపల్లె : వేంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో అక్రమ భవన నిర్మాణాలు, అక్రమ లే అవుట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నమయ్య అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వై.ఓబులేసు నందన్, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి కృష్ణ సింగ్‌లు పంచాయతీ, సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఎక్కువగా అనుమతి లేని లే అవుట్లు, భవన నిర్మాణాలు ఉన్నాయని వాటిని గుర్తించి వెంటనే నోటీసులు అందించాలన్నారు. ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పని చేయాలన్నారు. వారి, వారి సచివాలయ పరిధిలోని వాటిని గుర్తించి అప్రూవల్ చేసుకునేలా ప్రోత్సహించాలని ఒకవేళ నోటీసులు తీసుకుని నిర్లక్ష్యంగా ఉంటే వారిపై కేసులు నమోదు చేయించాలని తెలిపారు.

భవన నిర్మాణాలు 300 చదరపు మీటర్ల వరకు పంచాయతీ కార్యదర్శుల వద్ద అపైన భవన నిర్మాణాలు, లే అవుట్ల అనుమతులు పొందేందుకు అన్నమయ్య అర్బన్ డెవెలప్‌మెంట్ అథారిటీని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లికార్జున రెడ్డి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రికి చెందిన ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ వైద్యులు డాక్టర్ డి.వి.నారాయణరెడ్డి ఆసుపత్రిలో 24 గంటలు అందుబాటులో ఉండి ఎండోస్కోపీ, కోలోనోస్కోపీ, అన్ని జీర్ణకోశ, లివర్, ప్యాంక్రియాస్ క్యాన్సర్‌లకు ఆపరేషన్లు చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పిల్లల డ్రాపౌట్స్ లేకుండా చూడాలి

వేంపల్లె : తల్లిదండ్రులు తమ పిల్లలు పాఠశాల డ్రాపౌట్స్ లేకుండా చూసుకోవాలని తాళ్లపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం దస్తగిరి సూచించారు. జిల్లా విద్యా శాఖాధికారి సూచనల మేరకు శనివారం మండలంలోని తాళ్లపల్లె గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. విద్య కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. ముఖ్యంగా జగనన్న అమ్మ ఒడి, విద్యా కానుకల పేరుతో విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, యూనిఫాం, షూలు, బ్యాగులు అందిస్తున్నారన్నారు. అలాగే మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా జగనన్న గోరు ముద్ద ద్వారా నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తోందన్నారు. కాబట్టి తల్లిదండ్రులు కూడా పిల్లలను పాఠశాలకు పంపి, డ్రాపౌట్స్ లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చెన్నూరు : స్థానిక 3వ సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గంగనపల్లి సురేష్‌బాబు తెలిపారు. ఈ ఆధార్ కేంద్రం గతంలో మండలంలోని బలిసింగనపల్లె సచివాలయంలో ఉండేదని ఇప్పుడు ఆ కేంద్రాన్ని చెన్నూరు సచివాలయం-3కి మార్చామన్నారు. చెన్నూరు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వల్లూరు : కడప రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వల్లూరు మండలంలో ఖాళీగా వున్న అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టులకు మే 3వ తేదీలోపు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మేరీ విజయకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో రెండు పోస్టులు ఖాళీగా వున్నాయని ఇందులో చిన్నపుత్త అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టు ఓసీలకు, కుముద్‌బెన్‌జోషి నగర్ అంగన్‌వాడీ సహాయకురాలు పోస్టును ఎస్సీలకు కేటాయించారు. అభ్యర్థులు ఈ ఏడాది జూలై 1వ తేదీ నాటికి 21 సంవత్సరాలు పూర్తై 35 సంవత్సరాల లోపు గల వారై వుండాలన్నారు. 7వ తరగతి ఉత్తీర్ణులై స్థానిక వివాహిత మహిళ అయి వుండాలన్నారు. ఆసక్తి గల వారు అర్హతలకు సంబంధించిన అన్ని ధృవీకరణ పత్రాలను గెజిటెడ్ అధికారిచే అటెస్టేషన్ చేయించి వాటిని కడప రూరల్ ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలు పోస్టులకు ఖాళీలు ఉన్నాయని.. ఆసక్తిగల వారు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీఓ సునీత తెలిపారు. వేముల మండలం నారేపల్లె గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త ఓసీ, పులివెందుల రాజ్యలక్ష్మి హాలు అంగన్‌వాడీ సహాయకురాలు ఓసీ, సింహాద్రిపురం మండలం అహోబిలాపురం మినీ అంగన్‌వాడీ కార్యకర్త ఓసీ, తొండూరు యాదవవారిపల్లె మినీ అంగన్‌వాడీ కార్యకర్త ఓసీ, లింగాల, చెర్లోపల్లె మినీ అంగన్‌వాడీ కార్యకర్త ఓసీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇతర వివరాలకు పులివెందుల ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలో పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ హసీనా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాబానగర్ అంగన్‌వాడీ కార్యకర్త -ఓసీ, ఆర్ఎస్‌వై కాలనీ మినీ అంగన్‌వాడీ కార్యకర్త -ఎస్టీ, నరసరామయ్యగారిపల్లె అంగన్‌వాడీ సహాయకురాలు-ఓసీ, అంగడివీధి-1 అంగన్‌వాడీ సహాయకురాలు-ఎస్సీకి కేటాయించారు. మే9న కడప నగరంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.